## లగచర్ల దాడి కేసులో ఊరట





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 355 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- గురువారం 19 డిసెంబర్ 2024


## ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్






## అవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగు

● ఆదానీ అవినీతికి మోడీ ముసుగు ● ఆదానీ అవినీతిపై జెపిసి వేయాల్సిందే ● అవసరమైతే రాష్ట్రపతి భవన్ ముందూ ధర్నా ● హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా ● రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ పెద్దలు ● ధర్నాలో సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు

**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. ఆదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు. ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసు కోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి.

వివరాలు 2లో

## ఆదానీ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

●గురివింద చందంగా కాంగ్రెస్ వ్యవహారం ●సిఎం ధర్నా చేయడం దారుణం: కిషన్ రెడ్డి



**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రివర్గ సహచరులతో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హైదరాబాద్ రాజ్ భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారం గురివింద గింజ సామెతను తలపిస్తోందని.. అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రూ.100 కోట్లు అదానీ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ రూపంలో తీసుకుని ఒప్పందాలు తీసుకున్నారని.. ఎందుకోసం రూ. 100 కోట్ల సహాయం అడిగారో, ఎందుకు కలిసి ఫొటోలు దిగారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వందకోట్ల రూపాయలను స్కిల్ యూనివర్సిటీకి ఖర్చు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నప్పుడు గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. వందకోట్ల సహాయం ఎందుకు అడిగారు? ఎందుకు ఇస్తామన్నారు?.. ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని సవాల్ చేస్తున్నా.. రేవంత్ అయినా రాహుల్ గాంధీ అయినా.. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఒక సాక్ష్యం చూపిస్తారా అంటూ సవాల్ విసిరారు. మన మీడియా

వివరాలు 2లో

## జమిలి కోసం జేపీసీ.. 31 మందితో కమిటీ !




**న్యూఢిల్లీ,18(పిసిడబ్ల్యూ న్యూస్):** జమిలి ఎన్నికలకు సంబంధించి కేంద్రం జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)ని ఏర్పాటు చేసింది. పీపీ చౌదరి చైర్మన్‌గా మొత్తం 31 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఉంటారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రియాంక గాంధీ వాద్రా పేరును ప్రకటించారు.కాగా, వన్ నేషన్-వన్ ఎలక్షన్‌కు సంబంధించి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించిన బిల్లులను ఈ కమిటీ పరిశీలిస్తుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రేపు (గురువారం) లోక్‌సభలో జేపీసీ ప్రతిపాదనను ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ సమావేశాల

వివరాలు 2లో

## ఆటో డ్రైవర్ల వేషధారణలో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు

**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆటో డ్రైవర్ల యూనిఫామ్‌లు ధరించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం అసెంబ్లీకి వచ్చారు. ఆటోను నడుపుకుంటా అసెంబ్లీకి కేటీఆర్ వెళ్లారు. ఆటో డ్రైవర్లకు ఎన్నికల మేని ఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆటో డ్రైవర్ల వేసుకునే ఖాకీ చొక్కాలు ధరించి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీకి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. అంతే కాకుండా ఆటో డ్రైవర్లకు రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని బీఆర్‌ఎస్ కోరింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్‌ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. నిన్న అసెంబ్లీలో లగచర్ల రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ తో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధు లు, అసెంబ్లీకి నల్ల చొక్కా లు, చేతులకు బేడీలు వేసుకొనిఅసెంబ్లీకి వచ్చారు. ఆటోరిక్షాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీకి వచ్చిన విషయమై మంత్రి పొన్నం స్పందించారు. ఆటో రిక్షా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.




## ధరణి స్థానంలో భూ భారతి

● ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు ● ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం ● ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు ● అన్ని వర్గాలతో చర్చలు..సలహాలతో కొత్త చట్టం ● వివాదాల పరిశీలనకు కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు ● గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం ● అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తెచ్చిన ప్రభుత్వం ● గత పాలకుల ధరణి మోసాలను ఎండగట్టిన పొంగులేటి



**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ భూభారతి 2024 బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇద్దరు వ్యక్తులు తయారుచేసిన ధరణి, ఆర్‌వోఆర్ చట్టాన్ని ప్రక్షాళన చేశామని మంత్రి తెలిపారు. దొరల గడీల్లో కూర్చుని తయారుచేసిన 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ నాలుగు గోడల మధ్యన కూర్చొని ధరణి పోర్టల్ తెచ్చారని, వేల పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టంతో లక్షల సమస్యలు వచ్చాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇద్దరు వ్యక్తులు తయారుచేసిన ధరణి, ఆర్‌వోఆర్ చట్టాన్ని ప్రక్షాళన చేశామని మంత్రి తెలిపారు. హరీష్ రావు తమకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సూచనలను కూడా బిల్లులో పొందుపరచామన్నారు. దొరల గడిల్లో కూర్చుని తయారుచేసిన 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామన్నారు. ముసాయిదా బిల్లును వెబ్‌సైట్‌లో

వివరాలు 2లో

## లోటుపాట్లు సరిచేసుకుంటాం

- అక్రమార్కులను వదిలేది లేదు.
- 5 నెలల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి







## ధరణి పేరుతో భారీగా భూదందా బదలాయింపు

- భూమాయతో కాళేశ్వరంను మించిన అవినీతి
- భూముల మాయపై ఫోరెన్సిక్ ఆడిట్
- డిప్యూటి సిం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

## గజ..గజ..సింగిల్ డిజిట్‌కే పడిపోయిన ఉష్ణోగ్రతలు

● వణుకుతున్న ప్రజలు

**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.



## ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

- అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి



# జమిలి కోసం జేపీసీ.. 31 మందితో కమిటీ !

(మొదటి పేజీ తరువాయి)

చివరి వారంలో ఈ జేపీసీ కమిటీ తన నివేదికను సమర్పించనుంది. **జమిలి ఎన్నికల జేపీసీ కమిటీ సభ్యులు వీరే !...** పీపీ చౌదరీ, డాక్టర్ సీఎం రమేష్, బన్సూరీ స్వరాజ్, పరుషోత్తం భాయ్ రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాల్ రామ్, భర్తృహరి మహతాబ్, డాక్టర్ సంబిత్ పాత్ర, అనిల్ బాలుని, విష్ణు దత్ శర్మ, ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖ్‌దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కళ్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వగణపతి, జీఎం హరీష్ బాలయోగి, సుప్రియా సూలే, డాక్టర్ శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, చందన్ చౌహాన్, బాలశౌరి వల్లభనేని.. ప్రస్తుతానికి లోక్‌సభ నుంచి ఎంపికైన 21 మంది సభ్యుల పేర్లను మాత్రమే కేంద్రం వెల్లడించారు. మిగిలిన 10 మంది రాజ్యసభ ఎంపీల పేర్లను త్వరలోనే ప్రకటించనున్నారు.

## ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

**- అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయాని ఈ సందర్బంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

## లగచర్ల దాడి కేసులో ఊరట

**- నిందితులకు బెయిల్ మంజూరు**



**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):**లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులందరికీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం బెయిల్‌ను మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డితో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పట్నం నరేందర్ రెడ్డి రెండు 50 వేల షూరిటీలు, మిగతా వారు 20 వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఇతర రెవెన్యూ అధికారులపై స్థానికుల దాడి జరిగింది. ఈ దాడిలో అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి జరగడంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని ఆరోపించింది. స్థానికులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించారని కాంగ్రెస్ విమర్శలు చేసింది. బీఆర్ఎస్ నేతల ఆదేశాల మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తన అనుచరుడు భోగమోని సురేష్‌తో కలిసి ఈదాడి ఎలాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## విద్యార్థులకు జరిగిన నష్టానికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే : హరీశ్‌రావు

**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసిన వారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పడంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ అడ్మిషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బతీస్తాయని తాము ఆనాడే చెప్పామని గుర్తుచేశారు. ఈరోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటా నియమాలను హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆ తప్పుడు నియమాలతో జరిగినందువల్ల వందలాది మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన స్పష్టం చేశారు.

## అవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోడీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోడీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోడీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు. అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో ఆదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అదానీ దేశ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. అదానీ దేశ ప్రజలను సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారు.. బ్యాంకులను ఓ విధంగా మోసం చేశారో హిండెన్ బర్గ్, అమెరికా న్యాయవాదులు చెప్పారని గుర్తు చేశారు. అదానీ ఆర్థిక అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చ కోసం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. కొన్ని నెలలుగా జాతుల మధ్య అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోతున్న మోడీ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ క్రమంలోనే అదానీ ఇష్యూ, మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీపీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

## ఆదానీ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ముందు, న్యాయస్థానాల ముందు, ప్రజలముందు ఆధారాలు చూపించకుండా.. విమర్శలు చేయడం సరికాదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో వరుసగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న పార్టీ.. ఇవాళ ఫ్రస్టేషన్‌లో అదానీ మాట మాట్లాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పొరపాటు చేసిందని, కేంద్రం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ ఇవాళ నిరూపించగలదా అంటూ ప్రశ్నలు గుప్పించారు. మాటమీద నిలబడే సత్తాలేక.. ఇవాళ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా సరైన పాలన లేదని.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి మీద విచారణ లేదని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా అన్నిరకాల వైఫల్యంతో.. 12 ఏళ్లలో రావాల్సిన ప్రజావ్యతిరేకతను 12 నెలల్లోనే కూడగట్టుకున్నారన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. రేవంత్ రెడ్డి ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వైపే ఉన్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులేనంటూ కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతే.. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే రావాలని కాంగ్రెస్ అధిష్టానం.. రేవంత్ రెడ్డిని హెచ్చరించిందా అంటూ కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు.అందుకే రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పాట పాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ బొమ్మ బొరుసు లాంటి వ్యక్తులు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దొందూ దొందే అని.. ఈ రెండు పార్టీల పాలనకు తేడా లేదని అన్నారు. ప్రజలను వంచించడంలో తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో, కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో.. ఆ రెండు పార్టీల పనిచేసే తీరు ఒక్కటేనన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మూకుమ్మడిగా.. ప్రజాతీర్పును అగౌరవపరిచిన పార్టీలు నాడు బీఆర్ఎస్, నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పీఏసీ ఛైర్మన్‌గా, ఎంపీ అభ్యర్థిగా.. కాంగ్రెస్ నియమించడం కంటే బలమైన దోస్తీ ఉంటుందా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా కేసీఆర్ మారిస్తే.. రేవంత్ రెడ్డి మరింత దిగజారుస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఎవరు, ఎప్పుడు అప్పులిస్తరో తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదంటూ విమర్శింటారు.

## ధరణి స్థానంలో భూ భారతి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టి 40 రోజులు అభిప్రాయాలు సేకరించామన్నారు. 33 జిల్లాల్లో ప్రజల అభిప్రాయాలు తీసుకొని కొత్త భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు.కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దరావత్ రవి అనే బీఆర్ఎస్ ఎంపీటీసీ తన వద్దకు వచ్చారని, ఆ గ్రామంలో సర్వే నంబర్ 149 నుంచి 160 లో ఉన్న భూమి ధరణి వచ్చాక అటవీ భూమిగా మార్చారని చెప్పారన్నారు. వారి స్థానిక ప్రజాప్రతినిదులకే ధరణి న్యాయం చేయలేదన్నారు. అలాంటి వారికి న్యాయం చేసేలా కొత్త చట్టం తీసుకువచ్చామని చెప్పారు. 18లక్షల ఎకరాలు పార్ట్ బిలో ఉందన్నారు. గతంలో ఆ భూమికి పాస్ బుక్కులు ఉంటే ఎందుకు పార్ట్ బి లో చేర్చారని ప్రశ్నించారు. కొత్త చట్టం ద్వారా పార్ట్ బి లోని భూముల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అబాది, గ్రామ కంట భూములకు పరిష్కారాలు ఈ కొత్త చట్టంలో ఉన్నాయన్నారు. పొజిషన్‌కు, పాసుబుక్కులో ఉన్న భూ విస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేసే అవకాశం ఉందన్నారు.మ్యుటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో ఆధ్వర్యంలో అప్పీల్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వారసత్వ ఆస్తుల అభ్యంతరాలపై అప్పీల్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రాస్ చెక్ చేసి మ్యుటేషన్ చేసే అధికారం ఆర్డీవోకి కొత్త చట్టంలో కల్పిస్తుందన్నారు. సభ్యుల నుంచి మంచి సూచనలు వస్తే ఈ బిల్లులో చేర్చడానికి తమకు ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఎమ్మార్వో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఆర్డీఓ, కలెక్టర్ అప్పీల్ అథారిటీగా ఉంటారన్నారు. ఆ తర్వాత అప్పీల్ చేసుకోవడానికి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. 2020 కి ముందు 9,24,000 సాధబైనామ దరఖాస్తులు చేసుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.అర్ధరాత్రి అసెంబ్లీ బిజినెస్ ఎజెండాపై విపక్షాల గరం : అసెంబ్లీ బిజినెస్ ఎజెండాను ప్రభుత్వం అర్ధరాత్రి 12గంటల తర్వాత పెట్టడం సమంజంగా లేదంటూ ప్రతిపక్ష సభ్యులు ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో భూ భారతి బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ వెంటనే చర్చ పెట్టడంపై బీఆర్ఎస్ సహా ఎంఐఎం, బీజేపీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదమే ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని, అర్ధరాత్రి 12గంటల వరకు అసెంబ్లీ బిజినెస్ ఎజెండా కనిపించడం లేదన్నారు. ఒక బిల్లుపై మాట్లాడాలంటే కనీసం 12గంటల సమయం అవసరమన్నారు.ఇప్పుడే బిల్లు పెట్టి ఇప్పుడే సలహాలు, సూచనలివ్వమంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీష్ మాట్లాడుతూ అర్ధరాత్రి 12 గంటల తర్వాతా బిజినెస్ ఎజెండా పెట్టడాన్ని తప్పుబట్టారు. ఇది శాసన సభలో సభ్యుల హక్కులను ఈ సభ ఉల్లంఘిస్తుందని విమర్శించారు. బిల్లుపై కనీసం ఒక రోజు వర్కింగ్ డే ముందే మాకు అమెండ్మెంట్ పంపాలని కోరారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూ భారతి ప్రాధాన్యతతో కూడిన బిల్లు కావడంతో దీనిపై సభ్యులకు అధ్యయనానికి ఈ రోజు సమయమిచ్చి రేపు బిల్లుపై చర్చ పెట్టాలని కోరారు.

## లోటుపాట్లు సరిచేసుకుంటాం

- **అక్రమార్కులను వదిలేది లేదు.**
- **5 నెలల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**
- **హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి**



**హైదరాబాద్,డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది.

## ఆటో డ్రైవర్ల తీర్మానానికి బీఆర్ఎస్ వాయిదా

**హైదరాబాద్,18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

## ధరణి పేరుతో భారీగా భూదందా బదలాయింపు

- **భూమాయతో కాళేశ్వరంను మించిన అవినీతి**
- **భూముల మాయపై ఫోరెన్సిక్ ఆడిట్**
- **డిప్యూటి సిం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



**హైదరాబాద్,డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ధరణి పేరుతో పెద్దఎత్తున భూ బదలాయింపు దందా జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయని భట్టి ధ్వజమెత్తారు. సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఉపముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ భూ దందాతో పోల్చితే కాళేశ్వరం వ్యవహారం చిన్న విషయమని ఆయన చెప్పారు. వ్యక్తిగత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారని, పార్ట్-బి భూములన్ని సక్రమం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. దీని మొత్తాన్ని ఫోరెన్సిక్ ఆడిట్ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. హైదారాబాద్ పరిధిలోనే ఇలాంటి భూములు సుమారు 15 వేల ఎకరాలు ఉంటాయని అంచనా వేస్తున్నామని, అంత కంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పార్ట్-బిలో భూమి అనుకున్న వారి పేరు మీద రిజిస్ట్రేన్ చేశారని, ఆ తర్వాత వారు ఇంకొకరి పేరు మీద మ్యూటేషన్ చేశారని, ఇలా పెద్ద దందా జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూముల గురించి అడిగేవారు లేరని.. ఇనాం, ఎండోన్మెంట్, వక్ఫ్, అవెక్యు భూములన్నీ లూటీ చేశారని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల యజమానులు దేశంలో లేరని, వారంతా పాకిస్థాన్ వెళ్లారని, ఎవ్వరూ అబ్జెక్షన్ చెప్పకపోవడంతో అధికారులు సైతం సహకరించారని భట్టి ఆరోపించారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తుల మీద బదలాయింపు అయిందని ఆయన చెప్పారు. అదంతా ఇప్పుడు వాళ్ల హక్కు అయ్యిందని, ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చింది కాబట్టి భూమి వాళ్లదేనని చెప్పారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని నిజాలూ నిగ్గు తేలుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క చెప్పారు.

## జమ్ముకశ్మీర్‌లో అగ్ని ప్రమాదం.. ఆరుగురి మృతి

**శ్రీనగర్,డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని చికిత్స నిమిత్తం కథువాలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంటికి మంటలు అంటుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# కురవిలో 4వ రోజు రైతు కన్నీటి రిలే దీక్ష...

- రైతులందరికి పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలి
- కురవిలో శాంతియుతంగా రైతు కన్నీటి రిలే దీక్షకు సిపిఎం, కెవిపిఎస్, గిరిజన సంఘం, ఎన్పిఆర్డీ మద్దత్తు




**కురవి, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లెడి కోటయ్య, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, మాలోత్ కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి మండలంలోని తట్టుపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు బేతమళ్ళ సహాదేవ్ రుణమాఫీ కానీ రైతులందరికి చేయాలని కోరుతూ కురవి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రస్వామీ సెంటర్ లో "రైతు కన్నీటి రిలే నిరాహార దీక్ష 4వ రోజుకు చేరింది. బుధవారం దీక్షకు సిపిఎం, కెవిపిఎస్, గిరిజన సంఘం, ఎన్పిఆర్డి ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతూ ప్రకటించారు. వారు మాట్లాడుతూ.., అన్ని అర్హతలు ఉన్న రైతు సహాదేవ్ రూ.83వేలు రైతురుణమాఫీ కానీ ఎందరో రైతులు రుణమాఫీ జరగక ఇబ్బంది పడుతూ బ్యాంకుల, అధికారుల చుట్టూతిరుగుతున్నారని, ప్రభుత్వం రూ. 2 లక్షల లోపు రైతులందరికి రుణమాఫీ చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో సుమారు 33 శాతం రైతులకు రుణమాఫీ జరుగలేదన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా మొదటి, రెండవ, మూడవ, నాలుగు వ విడతగా ఉన్న రుణమాఫీ పూర్తి చేశామంటున్నా ప్రభుత్వానికి కనివిప్పి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి దళిత రైతు దీక్షతో కనివిప్పు జరిగి రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులందరికి రుణమాఫీ చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్పి ఆర్డి రాష్ట్ర మాజీ నాయకులు ఎస్ డి ఖాజా, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ సుధాకర్, మండల ఉపాధ్యక్షులు కట్ల కృష్ణయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు చెపూరి గణేష్, అర్వ్వారి శ్రీను, పాల్వాయి యాదగిరి, షేక్ యాకూబ్, రైతులు బేతమళ్ళ సహాదేవ్, సిహెచ్ ప్రేమ్ కుమార్, చంద్రశేఖర్, కె సైదులు ఉన్నారు.

# నేటి బాలికలే రేపటి మేధావులు

- వారికి సహాయం చేద్దాయి ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం
- 4370 నిరుపేద బాలికలకు సహాయం చేసిన ఓరియంట్ సిమెంట్ అధికారులు




**కాసిపేట ప్రతినిధి,డిసెంబర్18(పిసిడబ్ల్యూ న్యూస్):** అదొక మారుమూల గిరిజన ప్రాంతం. ఎవరికి ఏ మంచి వస్తువు కావాలన్నా వెళ్లాల్సిందే 35 కిలోమీటర్ల దూరం. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారం ఏర్పాటు చేయకముందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జిల్లాలో రాష్ట్రంలో ఎంతో పేరుగాంచిన కు గ్రామం దేవాపూర్. ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో ఉన్న గిరిజనులు అడవిని నమ్ముకొని ఎన్నో ఉత్పత్తులను అమ్ముకుంటూ కాలం వెళ్లదీశారు. 1979లో ఓరియంట్ సిమెంట్ కర్మాగారం ఏర్పాటు చేయాలని అప్పటి అధికారుల నిర్ణయం ఆదివాసి గిరిజనుల కట్టుబాట్లను వారికున్న ఆలోచనలను తారుమారు చేస్తూ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ మారుమూల గిరిజన ప్రాంతం కాదు ఇది, ఇదో మహోన్నతమైన ప్రదేశం ల మార్చారు ఓరియంట్ సిమెంట్ అధికారులు. గిరిజన గుడాలకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయడమే కాకుండా మంచి విద్యను అందించేందుకు ఆ ప్రాంతంలో మంచి పాఠశాలను ఏర్పాటు చేశారు.దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల మూడు పాఠశాలల్లో 4370 మంది విద్యార్థినీలకు శానిటరీ ప్యాడ్స్ ను ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ దేవాపూర్ యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో బుధవారం బాలికలకు అందజేశారు. దేవపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 1420 పాడ్స్ ను అలాగే దేవాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల 550, ఓరియంట్ కర్మాగారం కాలనీలో గల డిఏవి పాఠశాలలో 2400 ప్యాడ్స్ ను అందజేయడం జరిగిందని అన్నారు. జిఎం హెచ్ఆర్ ఆనంద కులకర్ణి, ఏటీఎం హెచ్ఆర్ ఉమా శంకర్, తిరుపతిలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**జగిత్యాల టౌన్, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల నియోజకవర్గానికి టూరిజం ప్రాజెక్ట్ మంజూరుచేయాలని,జగిత్యాల అర్బన్ మండలం అంబారీ పెట్ లో నగర్ వన్ ప్రాజెక్ట్ బీర్ పూర్ మండల రోళ్ళ వాగు ప్రాజెక్ట్ ను పర్యాటకంగా అభివృద్ధి చేసే విధంగా నిదులు మంజూరు చేయాలని కోరారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించిన మంత్రి టూరిజం ప్రాజెక్ట్ ,నిధుల మంజూరుకు హామీఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



# క్రీడాకారులకు గెలవాలనే తపన ఎక్కువ

- ఏసీపీ దేవేందర్ రెడ్డి ఎస్వీఎస్ ఇనిస్ట్యూషన్స్ ఆధ్వర్యంలో అండర్ 18 క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఏసిపి
- ఉత్సాహంగా క్రికెట్ ఆడిన ఎసిపి,సీఐ, చైర్మన్ తిరుమల్ రావు
- క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి
- ఎస్వీఎస్ ఇనిస్ట్యూషన్స్ గ్రూప్స్ చైర్మన్ తిరుమల్ రావు





**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గెలవాలనే తపన ఎక్కువ ఉంటుందని, క్రీడాకారులు జీవితాన్ని చాలెంజ్ గా తీసుకొని ముందుకు సాగుతారని, అలాంటివాళ్లు భవిష్యత్తులో ఉన్నతులుగా ఎదుగుతారని ఏసిపి దేవేందర్ రెడ్డి అన్నారు. భీమారం ఎస్వీఎస్ క్యాంపస్ లో ఎస్వీఎస్ ఇనిస్ట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 18 క్రికెట్, స్విమ్మింగ్ పోటీలను ఏసీపి దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికిన ఎస్వీఎస్ గ్రూప్స్ చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు ఏసిపి నీ ఘనంగా సన్మానించి మెమొంటోను ప్రధానం చేశారు. టార్చ్ వెలిగించి క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఏసిపి, క్రికెట్ ఆడి క్రీడాకారులు ఉత్సాహం నింపగా వారితోపాటు చైర్మన్ తిరుమల్ రావు, సీఐ రవికుమార్ క్రికెట్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చదువుతోపాటు ఆట పాటల్లో రాణించాలని, విద్యార్థులు ఒక చదువుపైనే దృష్టి సారించకుండా, క్రీడల వైపు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, కష్టపడితే ఉన్నతంగా ఎదగవచ్చు అనడానికి ఎస్వీఎస్ కాలేజీలే నిదర్శనం అన్నారు. చైర్మన్ తిరుమల్ రావు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది, ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలామంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని, వారిలోకి క్రీడా భావం నింపేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో పలు కాలేజీల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేశ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలన సమితి తెలంగాణ ఉపాధ్యక్షుడిగా ఉప్పుల రాజేందర్




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** అవినీతి నిర్మూలన సమితి వారి సమావేశం నేడు హైదరాబాద్లో భిక్షపతీ, గారి అధ్యక్షత న జరిగినది యు రాజేందర్, ఉపాధ్యక్షులు సికింద్రాబాద్ గారిని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదోన్నతి ప్రమాణ స్వీకార కార్యక్రమం కాప్రాలోని రాజేందర్ గారి ఆఫీస్లో విజయవంతముగా జరిగినది రబీంద్ర ద్వివేది, మరియు అలోక్ ద్వివేది గారి ఉత్తరువు ద్వారా. ఈ పదోన్నతి జరిగినది. నూతన బాధ్యతలు చేపట్టిన శ్రీ రాజేందర్ గారు అవినీతి నిర్మూలన సమితి పరిధి లో నికి వచ్చిన న్యాయపరమైన పనులు చేస్తానని మెరుగైన సేవలు రాష్ట్ర ప్రజలకు అందిస్తానని తెలియ చేసినారుభిక్షపతి గారు సమితి యొక్క ఆవిర్భావం, గూర్చి చేసిన సేవలు మరియు నియమ నిబంధనలు హాజరైన సమితి సభ్యులకు వివరముగా తెలియచేసినారు సమావేశానికి పొడిశెట్టి రమేష్, ఉపాధ్యక్షులు వరంగల్, కట్ట రత్నాకర్ రావు ఉపాధ్యక్షులు, హనుమకొండ, కిరణ్ ఉపాధ్యక్షులు, శ్రీమతి బేబీరాణి, ఉపాధ్యక్షులు మహిళా విభాగం మేడ్చల్ మల్కాజ్గిరి మరియు సత్యసింహ, దివాకర్, చంద్రమోహన్, నాగరాజు, కిషన్, అనంతకుమార్,. కోటక్ మహేంద్ర బ్యాంకు వారుహాజరై వారి వారి సలహాలు అందించినారు. సమావేశం విజయవంతముగా ముగిసినది.

# 19న ఎస్సీ ఏకసభ్య కమిషన్ రాక

- ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు

**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏకసభ్య కమిషన్ ఈ నెల 19న హనుమకొండ కలెక్టరేట్కు రానుంది. కమిషన్ సభ్యులు డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తల్ పాల్గొని, ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎస్సీ ఉప కులాల వర్గీకర ణపై కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరిస్తారు. ఈ బహిరంగ విచారణకు ఉమ్మడి జిల్లాల నుంచి ఎస్సీ ఉప కులాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విన తులు అందించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత కోరారు. ఈ సందర్భంగా ఇంతకుముందు పలు జిల్లాల్లో కమిషన్ కు 59 కులాల వారు సంఘాల నాయకులు ఇచ్చిన వినతి పత్రాలు, విజ్ఞప్తుల తరహాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ఇవ్వాల్సి ఉన్నది.ఈ సమాచారం ప్రకారం గా ఉమ్మడి జిల్లాలో ఉన్న 59 కులాల వారు ఏక సభ్య కమిషన్కు కులాల ప్రాతిపదికన రిజర్వేషన్ ఏర్పాటు చేయుటకు వినతి పత్రాలు సమర్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ కోరారు.



# పోలింగ్ బూత్ అధ్యక్షుల నియామకం

**కురవి, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజు ఆద్వర్యం లో మండలంలోని రాయిని పట్నం, లింగ్య తండా గ్రామాలలో భారతీయ జనతా పార్టీ కురవి మండల సంస్థాగత ఎన్నికల ఇంచార్జ్ చీకటి మహేష్ గౌడ్ సమక్షం లో పోలింగ్ బూతుల అధ్యక్షుల నియామకం చేపట్టడం జరిగింది. లింగ్య తండా పోలింగ్ బూత్ నెంబర్ 56 వ బూత్ అధ్యక్షునిగా లావుద్య రమేష్ మరియు రాయిని పట్నం పోలింగ్ బూత్ నెంబర్ 40 వ బూత్ అధ్యక్షునిగా కోల వెంకన్న గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల ఇంచార్జ్ చీకటి మహేష్ గౌడ్ తెలిపారు.మహేష్ గౌడ్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ అధ్యక్షులు బూతు స్థాయిలో గడప గడపకు భారతీయ జనతా పార్టీని విస్తరింప చేసేందుకు కృషి చేయాలని కోరారు. బూత్ అధ్యక్షులుగా ఎన్నికైన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొణతం పెంటయ్య , సోమ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ భవన్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**పరకాల, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదులో బుధవారం రోజున ఎఐసిసి ఆదేశాల మేరకు, టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం దేశ ప్రతిష్టలు దెబ్బతీసేలా గౌతమ్ ఆదానిపై ఆర్థిక అవకతవకలు, మణిపూర్ అల్లర్ల పై ప్రధాని మోడీ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం ఇందిరా పార్క్ నుండి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ అనంతరం రాజ్ భవన్ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న పరకాల మున్సిపల్ చైర్పర్సన్ సోదా అనిత రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, దార్న వేణుగోపాల్,మెరుగు శ్రీశైలం, ఎండి జాఫర్ రిజివి,కొలుగురి రాజేశ్వరరావు, బొచ్చు శ్రీధర్,గడ్డం శివ,పసుల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే స్పందించిన చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం



**గంగాధర, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గంగాధర బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నీటి సమస్య ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం గారి దృష్టికి తీసుకు వెళ్ళగానే తక్షణమే స్పందించి ఈరోజు బోర్వెల్ పంపించి. బోర్ వేపించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, వేముల అంజి, పెంచాల చందు. ప్రవీణ్. పాల్గొన్నారు.



# దేవా ఫౌండేషన్ అధ్యక్షుడి కూతురు పుట్టిన రోజు వృద్ధులకు పండ్ల పంపిణీ






**కరీంనగర్, డిసెంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** దేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సంకెనపల్లి దేవదాస్ కూతురు అక్షయశ్రీ పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ ఖరా?నా గడ్డలోని ఉన్న వృద్ధ ఆశ్రమంలో పండ్ల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు దేవదాస్ సభ్యులు అక్షయ శ్రీవినోదా దేవి మాళవిక సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# రాఘవరెడ్డి గృహప్రవేశంలో పాల్గొన్న మండల నాయకుడు....



**ఇల్లంతకుంట, డిసెంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మామిడి సంజీవ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో హాజరైన చల్మెడ...



**వేములవాడ, డిసెంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మందాల శ్రీనివాస్ కూతురి వివాహ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైన డిమాండ్: తాళ్ల నరేష్

**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైన డిమాండ్ అని ధర్మసమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏకసభ కమిషనర్ షమీమ్ అక్తర్ కు బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 15%శాతం ఉన్న ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో రాజేంద్రప్రసాద్, సాధన, నాగరాజు, సురేష్, అనిల్ పాల్గొన్నారు.



# వేణుగోపాలస్వామి ఆలయానికి పూర్వ వైభవం...

• పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి భూమిపూజ



**శంకరపట్నం, డిసెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం గల వేణుగోపాల స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని, అందులో భాగంగానే 50 లక్షల దేవాదాయ నిధులతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాక అదనపు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్,దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ గాజల వెంకటేశ్వర్లు, తనుకు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందంలు పాల్గొన్నారు.

# మానుకోటలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయండి



**గార్ల, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):**జిల్లా కేంద్రంలో ఈ నెల 26,27 తేదీలలో జరిగే ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ జి.సూర్య ప్రకాష్ అన్నారు. స్దానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో రాష్ట్ర సమావేశాల గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలలో ఒత్తిడి కి తట్టుకోలేక విద్యార్థులు రోజుకు రోజు ఆత్మహత్య చేసుకుంటున్నారని, విచ్చలవిడిగా నడుపుతున్న కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పెండింగ్లో ఉన్న ఫీజురియంబర్స్ మెంట్,స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యరంగం పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతీరేక విధానాలపై జిల్లా కేంద్రం లో రెండు రోజుల పాటు జరగనున్న సమావేశాలలో చర్చించుకుని భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో నాయకులు మనోజ్, తనీష్,వరుణ్,అఖిల, భార్గవి, వినయ్, అనిల్ తదితరులు ఉన్నారు.

# జిల్లాలో ఎస్సీల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్బర్‌కు స్వాగతం...

**కరీంనగర్, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్సీల వర్గీకరణ పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కరీంనగర్లో బహిరంగ విచారణ నిర్వహించింది. విచారణకు ముందు కరీంనగర్ కు చేరుకున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అత్తర్ కు కలెక్టర్ పమేలా సత్పతి స్వాగతం పలికారు. కలెక్టరేట్లో ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ పై అభ్యంతరాలను, వినతి పత్రాలను స్వీకరించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాల, మాదిగలు పోటాపోటీగా తమ అభిప్రా యాన్ని తెలియజేస్తూ విజ్ఞాపణలు అందజేశారు. ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ కావాలని మాదిగలు, ఏబిసిడి వర్గీకరణ వద్దని మాలలు వినతి పత్రాలు సమర్పించాగా 59 ఉపకులాలు తమ కుల వృత్తిలా ప్రదర్శనాలతో అభిప్రాయాలు తెలిపారు. వర్గీకరణ అభ్యంతరాలు అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి త్వరలోనే సమర్పిమని ఏకసభ్య కమిషన్ చైర్మన్ అక్బర్ తెలిపారు. అవసరమైతే ఎస్సీ కమిటీ హాల్ను కాలనీలను సందర్శించి అభిప్రాయాలను తెలుసుకొని సమగ్ర నివేదిక ఇస్తామని చెప్పారు.



# మిరపలో నల్ల తామర పురుగుల యాజమాన్యంపై రైతులకు అవగాహన





**రాజన్న సిరిసిల్ల జిల్లా, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ రోజు ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేట గ్రామం లో జిల్లా ఏరువాక కేంద్రం మరియు వ్యసాయ శాఖ ఆధ్వర్యంలో మిరపలో నల్లతామర పురుగు పై సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్. ఎం. రాజేద్రప్రసాద్ మాట్లాడుతు మిరప లో తామర పురుగులు పంటకు కలుగజేసే నష్టాన్ని మరియు సమగ్ర సస్యరక్షణ ద్వారా నల్ల తామర పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. నల్లతామర పురుగులు నివారణకు నీలిరంగు జిగురు అట్టలు (30-40) ఎకరానికి పెట్టుకోవాలి. వేపకషాయం(10000 ppm 600) మి.లి, ఎకరానికి మరియు సయాంత్రినిలిప్రోల్ 240 మి.లి. ఎకరానికి పిచికారి చేసుకోవాలి. అలాగే వరిలో యాసంగిలో వచ్చు పురుగుల తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. తదనంతరం జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్. కె. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల వ్యర్థాలను కాల్చకుండ మల్చర్ ని ఉపయోగించి నేలలో కలియదున్నాలని తెలిపారు. అలాగే యాసంగి వరిలో వచ్చే సల్ఫైడ్ దుష్ప్రభావం వలన వేర్లు నల్లగా మారి కుళ్ళిపోవడం మరియు కుళ్ళిన కోడిగుడ్ల వాసన వచ్చి, పొలంలో బుడగలు రావడం గమనించవచ్చు. నివారణకు కాంప్లెక్స్ ఎరువులను పైపాటిగా చల్లకుండా చూసుకోవాలి. మురికి నీరుని తీసేసి సన్నటి పగుళ్ల వచ్చేవరకు వరి పొలాన్ని ఆరబెట్టుకోవాలి. ఈ విధంగా సల్ఫయిడ్ దుష్ప్రభావాన్ని నియంత్రించుకోవచ్చు.అదే విధంగా వరిలో కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలనీ రైతులను కోరారు. తరువాత మండల వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చలి పెరుగుతున్నందున వరి నారుమళ్ళు ఎర్రబడుతున్నాయని మరియు వాటి నివారణ మార్గాలను రైతులకు తెలియజేశారు. తదుపరి రైతులు సాగు చేస్తున్న మిరప పంటలలో నల్ల తామర పురుగుల సమగ్ర సస్యరక్షణలో భాగంగా నీలిరంగు జిగురు అట్టలను పొలంలో అమర్చి దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో భాగంగా జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్.కె. మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త ఎం. రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారి లలిత మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

• గన్నేరువరం ఎస్సై తాంత్ర నరేశ్




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: మాదక ద్రవ్యాలు డ్రగ్స్ వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై తాంత్ర నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని గుండ్లపల్లి లోగల శ్రీ రామకృష్ణ స్కూల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వాటి వలన జరిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత విద్యార్థులు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు అని తెలిపారు. వీటి వినియోగంపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలుప అక్రమ రవాణా టాక్టర్ పట్టుకున్నారు.. అటవీ అధికారులు వదిలేశారు

**రామడుగు, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం వెదిర ఎక్స్ రోడ్ వద్ద కలప అక్రమంగా ట్రాక్టర్ లో తరలిస్తున్న ట్రాక్టర్ ను కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు వివరాల్లోకి వెళితే గంగాధర మండలం కురిక్యాల శివారు ప్రాంతంలో కలపను పోగుచేసి రామడుగు మండలం మీదుగా చొప్పదండికి తరలిస్తుండగా ఫారెస్ట్ ఆఫీసర్ వేణుగోపాల్ తో పాటు మండల అధికారి లత వెధిర ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నారు.కాగాచొప్పదండిలో వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి ఫోన్లో అధికారులతో మాట్లాడడంతో ట్రాక్టర్‌ను వదిలేసారు దీనిపై అధికారులకు వివరణకోరగారేపుయజమానులను విచారించనున్నారు తెలిపారు.



# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి..

**• సిపిఎం ఆధ్వర్యంలో తాసిల్దార్‌కి మెమోరాండం...**







**బయ్యారం, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ప్రభుత్వం గడచిన ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను కచ్చితంగా అమలు చేస్తామని విజయోత్సవాలు నిర్వహించిందని,ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం మహిళలకు 2500 రూపాయలు మరియు వ్యవసాయ కూలీలకు 12, 000 రూపాయలు, రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఎకరాకు 15 వేల ఎందుకు వేయలేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సన్నాలు పండించిన రైతులకు బోనస్ 500 ప్రకటించిన వారంలో మాత్రమే రైతు ఖాతాలోకి జమ అయ్యాయని ఆ తరువాత రైతు ఖాతాలలో బోనస్ డబ్బులు జమ కావటం లేదని వెంటనే బోనస్ డబ్బులను రైతు ఖాతాకు జమ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ క్రింద మండలంలో రెండు లక్షల లోపు రుణాలు నూటికి 50% మాఫీ అయ్యాయని రెండు లక్షల పైన రుణమాఫీలు ప్రభుత్వం చేయలేదని, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, అర్హులైన వారికి రాజకీయ ఒత్తిడి లేకుండా ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలని, రాష్ట్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలని, ఎన్నికలకు ముందు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బయ్యారం చెరువు కాలువలను శాశ్వత నిర్మాణాలుగా (సిమెంట్ కాంక్రీట్) ఏర్పాటు చేసి, సీతారామ ద్వారా బ్యాలెన్స్ రిజర్వాయర్ గా మారుస్తామని అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మాణానికి అన్ని వనరులు ఉన్నా కూడా కుంటి సాకులు చెప్పి సంస్థ నిర్మాణం కాకుండా బిజెపి ప్రభుత్వం చేస్తుందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి బయ్యారంలో కేంద్ర ప్రభుత్వ రంగ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్లతో బయ్యారం తాసిల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి ఆర్.ఐ నారాయణకు మెమోరాండం ఇచ్చారు. అనంతరం ఆ పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ అనేక మార్లు పై డిమాండ్ల సాధనకు పోరాటాలు చేసిన గత పాలకుల వలె ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని, బయ్యారం మండల అభివృద్ధికి ఇది చేస్తాం అది చేస్తామంటూ ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పి ముఖం తిప్పేసి పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఇప్పటికైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మండ రాజన్న, మండల కార్యదర్శి నంబూరు మధు, మండల కమిటీ సభ్యులు మక్కెన తిరుపతిరావు, అంగిరేకుల నాగేశ్వరరావు, నిడికొండ వెంకటేశ్వర్లు, బల్లెం ఆనందరావు తదితరులు ఉన్నారు.

# మిషన్ భగీరథ నీరు వృధాగా పోతున్నా పట్టించుకోని అధికారులు



**రామడుగు,డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని గోపాలరావుపేట గ్రామంలోని పాత బస్టాండ్ ఏరియా సర్దార్ సర్వాయి పాపన్న వెనకాల గత 15 నుండి 20 రోజుల నుంచి మిషన్ భగీరథ వాటర్ లీక్ అవుతున్నవి చూసి చూడనట్టుపట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు శాశ్వత పరిష్కారం పైపులైను పనిని త్వరగా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ కరాటే ఛాంపియన్‌కు గులాం అహ్మద్ ఆత్మీయ సన్మానం

**• కరాటే, తైక్వాండో, కుంగ్ ఫు చాంపియన్ షిప్‌లో విజేతగా నిలిచిన అర్మాన్ ఖాన్ • కరీంనగర్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన అర్మాన్ ఖాన్‌కు ఆదర్శప్రాయుడు • అర్మాన్ ఖాన్ ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి**

**• రాష్ట్ర క్రీడా శాఖ మంత్రికి గులాం అహ్మద్ విజ్ఞప్తి**





**కరీంనగర్, డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయస్థాయి గ్రాండ్ కరాటే, తైక్వాండో, కుంగ్ ఫు ఛాంపియన్షిప్ విజేత అర్మాన్ ఖాన్ ను ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ బుధవారం పార్టీ కార్యాలయంలో ఆత్మీయంగా సన్మానించారు. ఈనెల14,15వ తేదీల్లో హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో, కరాటే, కుంగ్ ఫు పోటీలకు 12 రాష్ట్రాల నుంచి సుమారు 1700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కరీంనగర్ కు చెందిన అర్మాన్ ఖాన్ ఇంటర్నేషనల్ గోజిరాయ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. అండర్ 19విభాగంలో కరాటే టైక్వాండో కుంఫు ఈ మూడు వరస పోటీలలో సత్తా చాటి నేషనల్ ఛాంపియన్షిప్ ను సాధించారు. ఇంటర్నేషనల్ గోజీరాయ్ కరాటే అకాడమీ చీఫ్ ఇన్స్ట్రక్టర్ అన్వర్ ఖాన్ ఆధ్వర్యంలో అర్మాన్ ఖాన్ విజయం సాధించడం కరీంనగర్ జిల్లా యువకుడు జాతీయస్థాయి ఛాంపియన్గా నిలవడం సంతోషకరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని దేశ కీర్తిని ప్రపంచంలో చాటాలని గులామ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్మాన్ ఖాన్ ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ఆర్థిక సాయం అందించి ప్రోత్సాహకం అందించాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి కి గులాం అహ్మద్ విజ్ఞప్తి చేశారు. అర్మాన్ ఖాన్ కరీంనగర్ జిల్లా క్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన నేపథ్యంలో అతడి ఆదర్శప్రాయమైన ప్రతిభకు ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని కోరారు. అర్మాన్ ఖాన్ అంశాన్ని తమ పార్టీ అధినేత భారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరమైన సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించిన అర్మాన్ ఖాన్ కు నిర్వాహకులైన ప్రముఖ సినీ డైరెక్టర్, నటుడు డి. కార్తీక్ కంటేష్ మాష్టర్, మరో డైరెక్టర్ విజయ్ చేతుల మీదుగా గ్రాండ్ ఛాంపియన్షిప్ అందుకొని, 10వేల నగదు ప్రశంసా పత్రాన్ని సైతం తీసుకున్నారని చెప్పారు. కోచ్ అన్వర్ ఖాన్ కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కోచ్ అక్బర్ ఖాన్, ఫైమిద ఖాతున్ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డులపై శాసనమండలిలో మాట్లాడిన జీవన్ రెడ్డి



**జగిత్యాల టౌన్, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లాలోతెలంగాణలో 24 గంటలు సర్వీస్ అందజేస్తున్నశాఖ పోలీస్ శాఖ అని ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం హోంగార్డుల విషయంపై శాసనమండలిలోమాట్లాడారు. వారి ఆరోగ్య భద్రత విషయంలోప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలోఅందడం లేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. హోంగార్డులు కానిస్టేబుల్లకు క్షేత్రస్థాయిలోఆరోగ్య సేవలు అందేలాచర్యలుతీసుకోవాలన్నారు.

# స్వామియే శరణం అయ్యప్ప

**• పాలకుర్తి నియోజకవర్గం ప్రజలందరికీ అయ్యప్ప స్వామి దీవెనలు ఎల్లవేళలా లభిస్తాయి • ఇరుముడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**





**తొర్రూర్ ప్రతినిధి,డిసెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి సంవత్సరం వచ్చేదీక్షలలో చలికాలంలో అయ్యప్ప స్వాములు చేపట్టే దీక్ష. అయ్యప్ప స్వామి అసలు పేరు ఆర్యన్. ఆర్య అంటే పూజించదగినవారు , ఒక్క అయ్యప్ప స్వామి కి మాత్రమే ఆర్య ఈ పేరు కలదు.అయ్యప్ప స్వామి దీక్ష ఎందుకు చేస్తారు. కఠోర దీక్ష 40 రోజులు గడ్డ కట్టే చలిలో కూడా చల్లని నీటితో స్నానం చేస్తూ అల్పాహారాన్ని భుజిస్తూ ఈ దీక్షను ప్రారంభిస్తారు. మనసును ఉల్లాసంగా ఉంచుకునేందుకు ఈ దీక్షలను చేపట్టడం జరుగుతుందని అంటుంటారు. 40 రోజుల దీక్ష అనంతరం గురుస్వాముల వద్ద ఇరుముడిని ధరించి శబరి కి వెళ్లి మొక్కులు చెల్లించుకొని వస్తుంటారు. ఇరుముడి ధరించే సమయంలో ముఖ్య అతిథులను, బంధుమిత్రులను మాల ధరింప చేసిన స్వాములు వారిని ఆహ్వానిస్తారు. అందులో భాగంగానే పాలకుర్తి నియోజకవర్గం లోని పెద్ద వంగర మండలం బొమ్మ కళ్ళు గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ని ఆహ్వానించారు. అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని పూజా కార్యక్రమంలో భక్తులందరూ ఆధ్యాత్మికలో నిండిన వాతావరణంలో పాల్గొనగా వేడుకలను ఎంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు ప్రసంగిస్తూ అయ్యప్ప స్వామి దీవెనలు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలందరిపై ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్ర మాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమని వాటిని ముందుకు తీసుకువెళ్లడంలో అందరి భాగస్వామ్యం అవసర మన్నారు. భక్తిశ్రద్ధలతో నిండి ఆధ్యాత్మిక శాంతిని పొందటానికి ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం మహత్తరమని వారు పేర్కొన్నారు. ఇరుముడి కార్యక్రమంలో ఎంతోమంది భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. మాల ధరించిన అయ్యప్ప స్వాములు అక్కడికి వచ్చిన భక్తులు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝాన్సీ రాజేం దర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నారు.

# సీఎం కప్ ఖోఖో పోటీలలో సత్తాచాటిన సారంగాపూర్ విద్యార్థినిలు

**జగిత్యాల టౌన్, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):**జగిత్యాల జిల్లాలో సారంగాపూర్ మండల విద్యార్థులు సీఎం కప్ జగిత్యాల జిల్లాస్థాయి ఖో - ఖో అమ్మాయిల విభాగం పోటీల్లోసారంగాపూర్ మండల విద్యార్థులు రెండవ స్థానంలోనిలిచారు. విద్యార్థులను, సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులను అధికారులు అభినందించి వారికిప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా ఈవిజయం పట్ల సారంగాపూర్ మండల ప్రజలు సంతోషంవ్యక్తం చేశారు.



# ఆనందగిరి సుందరధర్మ శాస్త్రా ఆలయంలో సంకష్ట చతుర్థి పూజలు



**గంగాధర, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మధురనగర్ ఆనంద సుందరధర్మ శాస్త్రా అయ్యప్ప ఆలయంలో ఆలయ ధర్మ కర్తలు శ్రీరామ్ శ్వేతా మధుకర్ వారి ఆధ్వర్యంలో ప్రతి మాసంలో సంకష్ట గణపతి కి ఫలా పంచామృతాలు తో అభిషేకం పూజలు నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమం లో అయ్యప్ప గురుస్వామి శ్రీనివాస్ రావు. వివేక్ కుమార్. నరేందర్ అయ్యప్ప స్వాములు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** క్రీడలలో రాణించేలా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్ లో చీఫ్ మినిస్టర్స్ కప్ -2024 జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో వివిధ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్రీడాకారులు, క్రీడలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర బడ్జెట్లో రూ. 375 కోట్లను కేటాయించారని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి



సహజమని అన్నారు. క్రీడల్లో పాల్గొని స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ జిల్లాతోనూ పోటీపడాలన్నారు. వివిధ క్రీడల్లో క్రీడాకారులు రాణించి హనుమకొండ జిల్లా పేరును తెలంగాణ రాష్ట్రంలో మార్మోగేలా తీసుకురావా లన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా క్రీడాకారులను మేయర్ తదితరులు పరిచయం చేస్తున్నారు. హ్యాండ్ బాల్ ఆడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి అజీజ్ ఖాన్,జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్ కుమార్,లు పాల్గొన్నారు.

# ఎల్ఎండిలో రిటైర్డ్, పెన్షనర్స్‌కు సన్మానోత్సవం..

- ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య

**కరీంనగర్ జిల్లా ప్రతినిథి, డిసెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి యూనిట్ రిటైర్డ్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో బుధవారం ఎల్ఎండి కాలనీలోని రిటైర్డ్ పెన్షనర్స్ సంఘ భవనంలో జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా వయోవృద్ధులైన రిటైర్డ్ పెన్షనర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ పెన్షన్స్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య, జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు హాజర య్యారు. జాతీయ పెన్షనర్స్ డే పురస్కరించుకొని విశిష్ట సేవలు అందించిన మాజీ అధ్యక్షులు బొమ్మిడి భద్రయ్య, దురిశెట్టి నారాయణ రెడ్డి, పసుల రాధమ్మ, సిద్దయ్య లతో పాటు దాదాపు 30 మంది రిటైర్డ్ పెన్ష నర్స్ ను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్య క్షులు గాజులు నర్సయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతల్లో విశిష్ట సేవలందించి, పదవీ విరమణ పొందిన పెన్షనర్స్ కు ప్రభుత్వం నుండి రావలసిన



పిఆర్సి,డిఎలు, ఇతర బెనిఫిట్స్ పై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, సాధ్యమైనంత తొందరగా పెన్ష నర్స్ కు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించాలని అన్నారు. బెనిఫిట్స్ పై కమిటీల పేరుతో కాలయాపన చేయ కుండా ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా రిటైర్డ్ పెన్షనర్లు సంఘటితంగా ఉద్యమించాల్సి వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ పెన్షన్స్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య,



జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షులు చల్లా మోహన్ రెడ్డి, సెక్రెటరీ ఇ. లింగయ్య, కోశాధికారి ఎన్. రాజేశం, సంయుక్త కార్యదర్శులు సి. సుధాకర్, కే. సుధాకర్, రాజారాం, మాజీ అధ్యక్షులు బొమ్మిడి భద్రయ్య, ఎల్ఎండి యూనిట్ అధ్యక్షులు రావుల సత్యనారా యణ, ప్రధాన కార్యదర్శి మన్నే జయచందర్, ఉపాధ్యక్షులు శాంతికుమార్, దేవయ్య, క్యాషియర్ బి. మల్లయ్య, నాయకులు జి. సత్యనారాయణ, డి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఖయ్యూం, అస్సన్, సిద్దయ్య, పసుల రాధమ్మ లతో పాటు దాదాపు 70 మంది పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.224 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి
- సానుకూలంగా స్పందించిన గడ్కరీ
- మానేరుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరిన బండి

**కరీంనగర్ జిల్లా ప్రతినిథి, డిసెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.224 కోట్ల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (CRIF) నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశంపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ప్రధానంగా కేశవపట్నం నుండి పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని,



కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని కోరారు. అట్లాగే చొప్పదండి మండలం అర్నకొండ నుండి గోపాల్ రావు పేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీల మేరకు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుండి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు 15 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని విజప్తి చేశారు. దీంతోపాటు కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్ (కి.మీ 18/0- 2), బావూపేట ఖాజీపూర్ ( కి.మీ2/0-2) వరకు మానేరు నదిపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం సహా మొత్తం 90 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ పనులకుగాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ విజప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని బండి సంజయ్ కు హామీ ఇచ్చారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపైనా గడ్కరీ ఆరా తీశారు.

# అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒకరిపై కేసు నమోదు

**కరీంనగర్ జిల్లా ప్రతినిథి, డిసెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: గన్నేరువరంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. గ్రామ సమీపంలోని మిడ్ మానేరు ప్రధాన కాలువ మట్టిని మధు అక్రమంగా తరలించి భూమిని చదువు చేస్తున్నాడని, అడ్డుకున్న గ్రామస్తులను బెదిరించాడని ఇరిగేషన్ ఏఈఈ మహేందర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.



# అరెస్ట్ కోసం కెటిఆర్ తహతహ

- ఎంపి చామల హాట్ కామెంట్స్



**హైదరాబాద్,డిసెంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని.. మరో రెండు, మూడు రోజుల్లో పోలీసులు ఆయనను అరెస్ట్ చేస్తారని తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ అరెస్ట్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడు అరెస్టు చేస్తారని కేటీఆర్ ఎదురు చూస్తున్నాడు.. ఆయనకు అరెస్టు కావాలనే ఇంట్రెస్ట్ చాలా ఎక్కువగాప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం మీద విష ప్రచారం చేస్తూ కేసులు పెట్టించుకోవాలనే భావనలో ఆయన ఉన్నారని.. అరెస్టయి ట్రెండింగ్‌లోకి రావాలని కేటీఆర్ భావిస్తున్నట్టు ఉన్నాడన్నారు. ఎవరైనా సరే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు.

## అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములపై సంబంధించిన ఎలాంటి వివాదం లేనట్లయితే వాటిని ధరణిలో నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జగిత్యాల టౌన్, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాలజిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్అధ్యక్షతన అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములనిర్వహణ, పరిరక్షణ, వివాదాల పరిష్కారాలపైప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రజావాణిలో వచ్చిన భూసమస్య వివాదాలను పరిష్కరించాలనిఆదేశించారు.వక్ఫ్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదంలేనట్లయితే వాటిని ధరణిలో నమోదు చేయాలన్నారు.అటవీ భూముల పరిరక్షణకుకఠినచర్యలుతీసుకోవాలన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు బెడ బుడగ జంగం కులస్తుల వినతి



**రామడుగు,డిసెంబర్18(పిసిడబ్ల్యూన్యూస్):** రామడుగులో గత కొద్ది నెలల నుండి స్థానిక ఎమ్మార్వో కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో నిర్లక్ష్యం వేయిస్తున్నారని బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ కమిషనర్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ కు రామడుగు మండల బేడ బుడగ జంగం(ఎస్సీ) కులస్తులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి గ్రామాలలో తాము నివసిస్తున్నామని అప్పటినుండి నేటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతూ వస్తున్నామని గత కొన్ని నెలల నుండి రామడుగు ఎంఆర్ఓ కుల దృవీకరణ పత్రాల జారీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని దీనిపై గతంలో కూడా ఆర్డీవో, కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసిన నేటికీ చర్యలుతీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో ఎటువంటి లోటు పాటు లేకుండా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.

## నెహ్రూ యువ కేంద్ర బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

- గన్నేరువరం-తిమ్మాపూర్ బ్లాక్

**కరీంనగర్ జిల్లా ప్రతినిథి, డిసెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: నెహ్రూ యువ కేంద్ర (ఎన్.వై.కె.ఎస్) మరియు యువ చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గన్నేరువరం మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ లో ఈనెల 22 వ తేదీన (వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షెటిల్)పోటీలు నిర్వహించడం జరుగుతుంది. వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి నాలుగు వేల రూపాయల క్రీడా సామాగ్రిని సెకండ్ విన్నర్ కి ట్రోఫీ మెడల్స్ సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుంది. అలానే పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుంది. గెలుపొందిన టీంలు జిల్లా స్థాయిలో పాల్గొంటారు.ఆసక్తి గల యువజన సంఘాల వారు సెల్ నంబర్ 9704448581 సంప్రదించగలరు.

## వీధి దీపాలు లేక చీకటిగా మండల కేంద్రం

**రామడుగు, డిసెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగులోని బస్టాండ్ కూడలి వద్ద వీధి దీపాలు లేక చీకటిగా మారిన ది గత కొద్ది రోజుల నుండి ప్రజలకు రాత్రివేళ ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బందిగా మారింది దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

